


చంద్రబాబుకు నీరాజనం



గొండుపాలెంలో 'రా.. కదలిరా' సభ సూపర్ సక్సెస్

భారీగా తరలివచ్చిన జనం

- జై బాబు..జైజై బాబు అంటూ పెద్దపెట్టున నినాదాలు
- టీడీపీ, జనసేన శ్రేణులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం
- ఖాళీ లేకపోవడంతో రోడ్లపైనే ఉండిపోవాల్సిన పరిస్థితి
- వెంకన్నపాలెం నుంచి కె.కోటపాడు వరకు పసుపుమయం
- ఊహించినదానికన్నా ఎక్కువ మంది హాజరు కావడంతో తెలుగు తమ్ముళ్లు ఉబ్బితబ్బిబ్బు

బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్-అనకాపల్లి/చోడవరం/కె.కోటపాడు/మాడుగుల)

'రా...కదలిరా' నినాదంతో తెలుగుదేశం పార్టీ సోమవారం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెం సమీపంలో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం అయ్యింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వందలాది వాహనాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో సభకు హాజరయ్యారు. ఇటు వెంకన్నపాలెం నుంచి అటు కె.కోటపాడు వరకు మొత్తం పసుపుమయం అయ్యింది. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించడానికి ముందే సభా ప్రాంగణం మొత్తం నిండి పోయింది. దీంతో చాలా మంది కార్యకర్తలు రోడ్డుపైనే ఉండిపో యారు. 'రా.. కదలిరా' సభకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది హాజరు కావడంతో తెలుగు తమ్ముళ్లు ఉబ్బితబ్బిబ్బయ్యారు. వచ్చే ఎన్నికల్లో మాడుగులలో తెలుగుదేశం గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

'రా.. కదలిరా' సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించగా, తొమ్మిది గంటల నుంచే పలు నియోజకవర్గాల నుంచి టీడీపీ కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతి పరులతోపాటు జనసేన శ్రేణులు కావడం మొదలుపెట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉదయం 11:45 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో సభాస్థలికి చేరుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు, ప్రజలు కేరింతలు కొడుతూ జై బాబు, జైజై బాబు అంటూ నినాదాలు చేశారు. హెలీప్యాడ్ వద్ద మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకుడు పైలా ప్రసాదరావు, తదితరులు ... మిగతా 5వ పేజీలో


సభకు హాజరైన అశేష జనం

విశాఖను వైసీపీ నేతలు దోచుకున్నారు

నాడు పెట్టుబడులకు స్వర్గధామం.. నేడు కబ్జాదారులకు కేంద్రం

- టీడీపీ తెచ్చిన కంపెనీలను వెళ్లగొట్టారు
- ఉత్తరాంధ్రలో అభివృద్ధి లేదు.. యువతకు ఉద్యోగాలు లేవు
- జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం
- అరాచక పాలనను అంతమొందించాలని ప్రజలకు పిలుపు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్-అనకాపల్లి/చోడవరం/కె.కోటపాడు/మాడుగుల)



ఉత్తరాంధ్ర అభివృద్ధికి టీడీపీ హయాంలో ఎన్నో కంపెనీలను తీసుకొస్తే, జగన్ వచ్చిన తరువాత తరిమేశారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. సోమవారం మధ్యాహ్నం 'రా...కదలిరా' పేరుతో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రశాంతతకు నిలయమైన విశాఖపట్నం..వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అశాంతి, హింసకు నిలయంగా మారిందని చంద్రబాబు ఆందోళన వ్యక్తంచేశారు. రుషికొండను అనకొండలా మింగేసి రాజ ప్రాసాదం కట్టుకున్నారని జగన్‌ను ఉద్దేశించి అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఇస్తున్న రూ.1.5 లక్షలు తప్ప రాష్ట్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. ఉత్తరాంధ్రలో రోడ్లు వేయలేదు, అభివృద్ధి లేదు, పిల్లలకు ఉద్యోగాలు రాలేదన్నారు. విశాఖ జిల్లా పెట్టుబడులకు స్వర్గధామమని, కానీ వైసీపీ పాలనలో కబ్జాదారులకు కేంద్రంగా మారిందన్నారు. ఒక్క విశాఖపట్నంలోనే వైసీపీ నాయకులు రూ.40 వేల కోట్ల విలువ చేసే భూములను దోచేశారన్నారు. టీడీపీ హయాంలో లులూ, హెచ్‌ఎస్‌బీసీ, అదాని డేటా సెంటర్ వంటి వాటిని తీసుకొస్తే...జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత వారందరినీ తరిమేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదని, రైల్వే శాఖ అడిగిన భూమిని ఈ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై జగన్ నోరు మెదపడం లేదన్నారు.

వైసీపీ అరాచక, అవినీతి పాలన సాగిస్తున్నదని చంద్రబాబు అన్నప్పుడు సభికుల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది. వైసీపీ పాలనలో మద్యం ధరలు, కరెంటు చార్జీలు, ఇళ్ల పన్నులు పెంపు, చెత్త పన్ను విధింపు, పెట్రోల్, డీజిల్ రేట్లు ఎంతెంత పెరిగాయో చంద్రబాబు సవివరంగా వెల్లడిస్తుంటే సభకు హాజరైన ప్రజలు శ్రద్ధగా ఆలకించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలు, రైతుల కోసం అమలు చేయనున్న 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించారు. ప్రసంగం ముగించిన తరువాత 'సైకో పోవాలి...సైకిల్ రావాలి' అంటూ డీజేలో పాటనే ప్లే చేయగా, స్టేజీ ముందున్న యువత నృత్యాలు చేశారు. చంద్రబాబు నాయుడు రెండు చేతులు పైకెత్తి వారిని ... మిగతా 5వ పేజీలో


టీడీపీ నేతలు బహూకరించిన కరవాలాన్ని చూపుతున్న చంద్రబాబు

హాస్టల్ విద్యార్థి మృతికి వార్డెన్ నిర్లక్ష్యమే కారణం?


జోగంపేటలో బాలుర వసతిగృహం

వసతిగృహంలో అస్తవ్యస్తంగా విద్యుత్ వైరింగ్

- వర్షం కురిస్తే షాక్ కొడుతున్న గోడలు, శ్లాబ్, ఇనుప వస్తువులు
- ఎనిమిది నెలల క్రితమే గుర్తించి.. వార్డెన్‌కు చెప్పిన విద్యార్థులు
- విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయని వార్డెన్
- తమ బిడ్డ ప్రాణాలు తీశారంటూ తల్లిదండ్రులు ఆవేదన

గొలుగొండ, ఫిబ్రవరి 5:

మండలంలోని జోగంపేటలో సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందడానికి హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎనిమిది నెలల నుంచి షార్ట్ సర్క్యూట్ అవుతున్నప్పటికీ ఈ విషయాన్ని లిఖిత పూర్వకంగా విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయలేదు. అతని నిర్వాకమే తమ బిడ్డ ప్రాణాలు తీసిందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

పాతమల్లంపేట గ్రామపంచాయతీ శివారు బుడ్డడపాడు గ్రామానికి చెందిన తుబిరె దావీద్‌రాజ్(12) అనే గిరిజన విద్యార్థి జోగంపేట హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతూ, సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో వుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తరువాత మేడపైన దుస్తులు ఆరబెట్టడానికి వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన విషయం తెలిసింది. సంఘటన జరిగిన ప్రదేశాన్ని, హాస్టల్ భవనం పరిసరాలను పరిశీలించిన విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్థులు.. వార్డెన్ నిర్లక్ష్యం వల్లనే దావీద్‌రాజ్ మృతిచెందాడని ఆరోపించారు. వర్షం కురిసినప్పుడు శ్లాబ్‌తోపాటు గోడలు, ఇనుప ఊచలకు కరెంటు సరఫరా అవుతున్నట్టు సుమారు ఎనిమిది నెలల క్రితం హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు గుర్తించారు. ఈ విషయాన్ని వార్డెన్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన లిఖితపూర్వకంగా విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయలేదు.


వసతిగృహంలో విద్యుత్ వైరింగ్‌ను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ డీఈ సునిల్‌కుమార్ (ఇన్‌సెట్‌లో) విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందిన విద్యార్థి దావీద్‌రాజ్

కాగా హాస్టల్ లో విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఈపీడీసీఎల్ డీఈ సునిల్‌కుమార్ సోమవారం సిబ్బందితో వచ్చి వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యుత్ వైరింగ్ సరిగా లేకపోవడం వల్లనే విద్యార్థి విద్యుత్ షాక్‌కు గురైనట్టు గుర్తించామని తెలిపారు. వాటర్ ట్యాంకు నిండిన అనంతరం నీరు శ్లాబ్‌పై ఉండడంతో అక్కడ వున్న ఇనుప పైపునకు విద్యుత్ సరఫరా (ఎర్త్ కావడం) జరిగిం దని, దుస్తులు ఆరేసుకోవడానికి వచ్చిన విద్యార్థి దావీద్‌రాజ్ ఈ పైపును పట్టుకోవ డంతో విద్యాదాఘాతానికి గురై మృతిచెందినట్టు గుర్తించామన్నారు. హాస్టల్ ఆవరణలో వున్న విద్యుత్ లైన్ కారణంగా ప్రమాదం జరగలేదని, భవనానికి మూడు మీటర్ల దూరంలో వైర్లు వున్నాయని చెప్పారు. విద్యుత్ లైన్ కారణంగా ప్రమాదం జరిగితే తాము బాధ్యత వహిస్తామని, కానీ హాస్టల్ భవనం ఇంటర్నల్ వైరింగ్ లోపం కారణంగా ప్రమాదం జరిగినందుకు ఈ సంఘటనతో తమకు ... మిగతా 6వ పేజీలో

భారత్ హ్యాట్రిక్

విశాఖలో మరో విజయం

వరుసగా మూడో టెస్ట్‌లోనూ గెలుపు

- కలిసొచ్చిన పిచ్‌పై కదంతొక్కిన ఇండియా
- ఇంగ్లండ్‌పై 106 పరుగులతో విజయం

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 5:

అద్వితీయమైన ఆటతీరుతో భారత్ జట్టు తనకు కలిసొచ్చే పిచ్‌పై మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో 106 పరుగులతో విజయం సాధించింది. దీంతో ఇప్పటివరకూ ఇక్కడ జరిగిన మూడు (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో) టెస్ట్ మ్యాచ్‌లలో విజయం సాధించినట్టయ్యింది.

కుప్పకూలిన ఇంగ్లండ్ బ్యాటింగ్

పిచ్‌పై పగుళ్లు ఏర్పడి నాలుగో రోజు స్పిన్నర్లకు అనుకూలించేలా మారినా కెప్టెన్ రోహిత్‌శర్మ ఫాస్ట్ బౌలర్లు బుమ్రా, అక్షర్ పటేల్‌లతోనే బౌలింగ్ ప్రారంభించాడు. ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ జాక్ క్రాలీ, రెహన్ అహ్మద్ జట్టు స్కోరును వందకు చేర్చారు. ఆ సమయంలో రెహన్ అహ్మద్‌ను (23)ను అక్షరపటేల్ అద్భుతమైన బంతితో ఎల్బీడబ్ల్యు చేశాడు. రెహన్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన పోప్...కొద్దిసేపు బ్యాట్ ఝుళిపించాడు. బుమ్రా స్థానంలో బౌలింగ్‌కు వచ్చిన అశ్విన్...పోప్‌ను అవుట్ చేశాడు. పోప్ స్థానంలో వచ్చిన రూట్ కూడా అశ్విన్ బౌలింగ్‌లోనే అక్షరపటేల్ క్యాచ్ పట్టడంతో వెను తిరిగాడు. వ్యక్తిగత 61 పరుగుల వద్ద స్టంపౌట్ నుంచి తప్పించుకున్న జాక్ క్రాలీ (73)ని కులదీప్ యాదవ్ ఎల్బీడబ్ల్యుగా అవుట్ చేశాడు. కొద్దిసేపటికే జానీ బెరస్టోవ్‌ను (26) బుమ్రా ఎల్బీడబ్ల్యుగా పెవిలియన్‌కు పంపడంతో లంచ్ సమయానికి ఇంగ్లండ్ 194 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. లంచ్ తర్వాత కెప్టెన్ బెన్ స్టోక్ (11) అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. ఆ తరువాత బెన్ ఫోక్స్ (36), టామ్ హార్డ్‌లీ (36) కలిసి ఎనిమిదో వికెట్‌కు 50 పరుగులు జోడించి భారత్ బౌలర్లకు సహన పరీక్ష పెట్టారు. బెన్ ఫోక్స్‌ను బుమ్రా అవుట్ చేయగా, ఫోక్స్ స్థానంలో వచ్చిన షోయబ్ బషీర్ (0) కొద్దిసేపటికే ముకేష్‌కుమార్ బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. చివరిగా టామ్ హార్డ్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లంగ్ రెండో ఇన్నింగ్స్ 292 పరుగుల వద్ద ముగిసి ఓటమి చెందింది.



బుమ్రాను అభినందిస్తున్న సహచర ఆటగాళ్లు

ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చుట్టేసిన బుమ్రా, అశ్విన్

తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసిన బుమ్రా...రెండో ఇన్నింగ్స్‌లో కూడా పదునైన బంతులతో మూడు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ తీయలేకపోయినా అశ్విన్...రెండో ఇన్నింగ్స్‌లో మూడు కీలక వికెట్లు పడగొట్టి టెస్టు కెరీర్‌లో 499 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.

కరతాళ ధ్వనులతో ప్రేక్షకులు

రెండో టెస్టులో ఒకరోజు మిగిలి ఉండగానే అద్భుతమైన గెలుపుతో భారత్ సిరీస్‌ను సమం చేసింది. చివరి వికెట్‌గా టామ్ హార్డ్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేసిన వెంటనే స్టేడియం హోరెత్తింది. కాగా రెండు ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు పడగొట్టి భారత్ జట్టు విజయంలో కీలకపాత్ర వహించిన బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (209) చేసిన యశశ్వి జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (104) చేసిన శుభమన్ గిల్ ఉత్తమ బ్యాట్స్‌మెన్ అవార్డు అందుకున్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా ·5లో

అనుమానాస్పదంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 5: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన రుత్తల అమ్మాజీ చిన్న కుమార్తె రత్నమాధురి (26), నాతవరం మండలం వెన్నలపాలెం గ్రామానికి చెందిన వాసురెడ్డి శేఖర్ ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే పనిచేస్తున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పిన శేఖర్ ...ఆ తరువాత మాటమార్చాడు. దీంతో ఇరువురు కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరిగాయి.

గుడికి వెళతానని బయటకు....

గత నెల 27వ తేదీన రత్నమాధురి గుడికి వెళ్లి వస్తానని తల్లికి చెప్పి బయటకు వెళ్లింది. ఎంతకీ రాకపోయే సరికి ఫోన్ చేస్తే ఫ్రెండ్ దగ్గర ఉన్నాను...వస్తాను అని చెప్పింది. అదే రోజు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో శేఖర్ తన కుమార్తెను ఇంటి వద్ద దింపి వెళ్లాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రత్నమాధురి తల్లి పేర్కొన్నారు. ఎక్కడకు వెళ్లారని తన కుమార్తెను ప్రశ్నిస్తే శేఖర్ వైజాగ్ తీసుకు వెళ్లాడని చెప్పిందని వివరించారు. తలనొప్పిగా ఉంది పడుకుంటానని చెప్పి రత్నమాధురి గదిలోకి వెళ్లిందని, మరుసటిరోజు నుంచి నీరసించిపోయి ఒంటరిగా గదిలో ఉండిపోయిందని ఆమె తల్లి పోలీసులకు చెప్పారు. రెండు రోజుల తర్వాత వాంతులు అవుతుండడంతో జనవరి 30వ తేదీన ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించామని, వైద్యులు రెండు రోజులు చికిత్స అందించినా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో వైద్యులకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో శేఖర్‌కు రత్నమాధురి పెద్దమ్మ కుమార్తె లాలం శిరీషా ఫోన్ చేసి అసలు ఏం జరిగిందని ప్రశ్నించింది. దీంతో శేఖర్ పాయిజన్ సీసా ఫొటో ఒకటి వాట్సాప్‌కు షేర్ చేశాడు. ఆ సీసా చూసిన డాక్టర్ హుటాహుటిన విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి కోమాలోకి వెళ్లిపోయింది. ఆదివారం సాయంత్రం కోమా నుంచి బయటకు వచ్చినట్టు దగ్గర బంధువు లాలం శ్రీరంగస్వామి చెప్పారు. తమతో మాట్లాడే ప్రయత్నం చేసి మళ్లీ కోమాలోకి వెళ్లిందన్నారు. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం రాత్రి 10.30కు తుది శ్వాస విడిచింది.


రుత్తల రత్నమాధురి (ఫైల్ ఫొటో)

విషం తాగి చనిపోదామని నమ్మించాడా ?

గత నెల 27 తేదీన రత్నమాధురిని కలిసిన శేఖర్...ఇద్దరం విషం తాగి చని పోదామని చెప్పి...ముందు రత్నమాధురితో తాగించి తాను తాగి ఉండడని ఆమె బంధువు లాలం శ్రీరంగస్వామి ఆరోపిస్తున్నారు. మృతురాలి తల్లి అమ్మాజీ ఈ నెల 2వ తేదీన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో...వాసిరెడ్డి సన్యాసినాయుడు ఉరఫ్ శేఖర్ తన కూతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, తనను వదించుకోవాలని ఉద్దేశంతో విషం తాగించాడని ఆరోపించారు. కాగా రత్నకుమారిది ఆత్మహత్య హత్యా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. దీనిపై పట్టణ సీఐ క్రాంతికుమార్‌ను వివరణ కోరాగా...మృతురాలి తల్లి అమ్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విషాదాంతంగా ముగిసిన ప్రేమకథ

- ప్రియుడే కారణమంటున్న బంధువులు
- చంపాలని ఉద్దేశపూర్వంగా విషం తాగించాడని ఆరోపణలు

'రా కదలిరా' సభ సక్సెస్

మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెం సమీపంలో 'రా...కదలిరా' నినాదంతో తెలుగుదేశం పార్టీ సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు అనకాపల్లి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతిపరులు భారీగా హాజరయ్యారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రసంగం ప్రారంభించడానికి ముందే సభా ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ఇంకా చాలా మంది కార్యకర్తలు బయటే ఉండిపోయారు. చంద్రబాబునాయుడు వచ్చిన తరువాత టీడీపీ, జనసేన శ్రేణులు జై బాబు, జై పవన్ అంటూ నినాదాలు చేశారు.





టీడీపీ, జనసేన జెండా ఊపుతున్న చంద్రబాబు



ఎన్టీఆర్ ప్రతిమ వద్ద పూలు వేసి నివాళులర్పిస్తున్న చంద్రబాబు నాయుడు



వేదికపై తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు



పార్టీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న చంద్రబాబు



వేదికపై చంద్రబాబుతో టీడీపీ, జనసేన నాయకులు



వేదికపై ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు



మహిళల ఆనందోత్సాహం



హాజరైన అశేష ప్రజానీకం

జగన్ పాలనలో రైతులకు తీరని అన్యాయం: బుద్ద



కె.కోటపాడు, ఫిబ్రవరి 5: జగన్ పాలనలో రైతులు అన్ని రకాలుగా నష్టపోయారని, ప్రత్యేకించి చెరకు రైతులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద జగజగదీశ్వరరావు ఆరోపించారు. మండలంలోని గొండుపాలెంలో నిర్వహించిన 'రా.. కదలిరా' సభలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి వనరులు ఐదేళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురయ్యాయని, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం సంగతి అటుంచి, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడంతో ఆయకట్టుకు నీరు అందక వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. జిల్లాలో నాలుగు షుగర్ ఫ్యాక్టరీలకు గాను మూడు ఫ్యాక్టరీలను వైసీపీ పాలకులు మూసివేయించి చెరకు రైతులకు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.

టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయం: బండారు



మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖ నగరానికి నీటిని సరఫరా చేసి, అనంతరం రైవాడ నీటిని పూర్తిగా ఈ ప్రాంత రైతుల అవసరాలకే కేటాయించాలని చంద్రబాబును కోరారు. జిల్లాలో వైసీపీ పాలనలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి రైతులకు, కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సత్తా బాబుకే ఉంది: పంచకర్ల



రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, తిరిగి గాడిలో పెట్టాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సి అవశ్యకత ఎంతైనా వుందని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. వైసీపీ పానలలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. టీడీపీ-జనసేన కూటమి 175/175 సీట్లు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్ర సర్వనాశనం: వి.అనిత



తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ, వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో సైకోను తరిమి కొట్టాలని, ధైర్యమే ఆయుధంగా కార్యకర్తలు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో డీఎస్సీని ప్రకటించడం నిరుద్యోగులను మోసగించడమేనని ఆమె విమర్శించారు.

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎలమంచిలి, ఫిబ్రవరి 5: ఎలమంచిలి, రేగుపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ ఎస్‌కే మారూఫ్ తెలిపారు. మృతుడికి 35-40 ఏళ్ల వయస్సు ఉంటుందని, లేత నీలం రంగు టీ షర్ట్, నలుపు రంగు జీన్ ప్యాంటు ధరించి వున్నాడని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా వుంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థి మృతిపై కొనసాగిన ఆందోళన

- మృతుని కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
- ఇంట్లో ఒకరికి ఉపాధి, సాగు భూమి ఇస్తామని ఆర్డీవో హామీ
- శాంతించిన ఆందోళనకారులు



ఏరియా ఆస్పత్రి దగ్గర ఆందోళన చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 5 : విద్యుదాఘాతంతో మృతి చెందిన గొలుగొండ ఎస్టీ బాలుర వసతి గృహ విద్యార్థి తూబిరి దావిద్ రాజ్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని రెండో రోజూ ఆందోళన కొనసాగింది. సోమవారం విద్యార్థి సంఘాలు, గిరిజన సంఘాలు, గిరిజన ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల, గొలుగొండ ఎస్టీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి అప్పారావులను ఆర్డీవో విచారించారు. ఈ సందర్భంగా విద్యుత్ వైర్ల సమస్యపై గత నెల 23 తేదీన గొలుగొండ ఏఈకి ఫిర్యాదు చేశామని వార్డెన్ ఆర్డీవో తెలిపారు. విద్యార్థులు మేడ మీదకు వెళ్లకుండా మెట్ల మార్గంలో ముళ్ల కంచె వేశామని తెలిపారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలతో చర్చలు జరిపారు. రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సాయం, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం, సాగు భూమి, ఇంట్లో ఒకరికి ఉపాధి ఇవ్వడానికి ఆర్డీవో హెచ్‌వీ జయరాం హామీ ఇచ్చారు. ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల, గొలుగొండ ఏపీ ఈపీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఏఈ రాజేంద్రకుమార్, వసతి గృహ సంక్షేమ అధికారిమడ్డు అప్పారావులపై కలెక్టర్‌కి నివేదిక పంపామని తెలిపారు. అనంతరం ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకారుల వద్దకు ఆర్డీవో వెళ్లి రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. మిగిలిన హామీలకు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎంపీపీ గజ్జల మణి కుమారి, గిరిజన సంఘం నాయకులు గోవిందరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా జి. గీతా కృష్ణ, సీపీఎం నాయకులు అడిగర్ల రాజు, బీఎస్పీ ఇన్‌చార్జ్ నాగరాజు, విద్యార్థి సంఘం నాయకులు ఫణీంద్ర, రాధాకృష్ణ, దళిత సంఘాల నాయకులు నేతల నాగేశ్వరరావు, చిట్ల చలపతి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చంద్రబాబుకు నీరాజనం

... 3వ పేజీ తరువాయి

చంద్రబాబుకు స్వాగతం పలికారు. అనంతరం 11:55 గంటలకు చంద్రబాబు వేదికపైకి వచ్చారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం జై బాబు, జైజై బాబు అంటూ నినాదాలతో హోరెత్తింది. వేదికపై ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా ప్రసంగించారు.

గత ఎన్నికల్లో జగన్ మాయమాటలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చి మోసపోయారని, మళ్లీ ఇప్పుడు సిద్ధం అంటూ వస్తున్నాడని, ఇంకోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని చంద్రబాబు అన్నారు. వైసీపీ అరాచక పాలనను అంతమొందించి జగన్‌ను ఇంటికి పంపడానికి యువత, మహిళలు, రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రపంచంలో తెలుగు వారిని నంబర్ వన్‌గా ఉంచాలన్నదే తన లక్ష్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్క కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు ఇంత పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఎన్నికల యుద్ధానికి తాము సిద్ధమని సంకేతాలు పంపితే తాడేపల్లి పిల్లికి జ్వరం వస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, వైసీపీ అరాచక పాలనను అంతం చేయడానికి ప్రతిఒక్కరూ ఒక స్టార్ క్యాంపెయినర్‌గా మారాలని పిలుపునిచ్చారు. పేదల భూములు కొట్టేయడానికి వైసీపీ కొత్తగా తెచ్చిన భూ చట్టాన్ని టీడీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేస్తానన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం....

అంతకుముందు ఉదయం 11.45 గంటలకు హెలీకాప్టర్‌లో గొండుపాలెం చేరుకున్న చంద్రబాబునాయుడుకి టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు హెలీప్యాడ్‌లో దిగగానే కార్యకర్తలు, నాయకులు భారీసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టీడీపీ నాయకులు దాడి వీరభద్రరావు, పప్పల చలపతిరావు, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, కేఎస్ఎన్ఎస్ రాజు, బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్‌చక్రవర్తి, దాడి రత్నాకర్, లాలం కాశినాయుడు, రొంగలి మహేశ్, దాడి ఎరుకునాయుడు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, ఆ పార్టీ నాయకులు సుందరపు విజయ్‌కుమార్, రాయపురెడ్డి కృష్ణ, బి.శివదత్, పీవీఎస్ఎన్ రాజు, సూర్యచంద్ర, తదితరులు చంద్రబాబుకు స్వాగతం పలికారు.

జగన్ ఓ 420.. ఇది గూగుల్ చెప్పేమాట

- ఆయన ఏం చేశారని జనం ఓట్లేయాలి
- యువతకు చంద్రబాబు ఐటీలో ఉద్యోగాలు ఇస్తే, జగన్ చేపల దుకాణాలు, బ్రాందీ షాపుల్లో ఉద్యోగాలు ఇస్తున్నాడు
- మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు



సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

కె.కోటపాడు, ఫిబ్రవరి 5: దేశంలో 420 సీఎం ఎవరంటే ఏపీ సీఎం జగన్ పేరువస్తుందని, జగన్ 420 సీఎం అని తాను చెప్పడం లేదని...గూగుల్ చెబుతుందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం మధ్యాహ్నం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో 'రా...కదలిరా' పేరుతో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ తేలని జగన్‌కు ప్రజలు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. పంతొమ్మిదిసార్లు మోదీని కలిసిన జగన్, ప్రత్యేక హోదాపై ఎందుకు మాట్లాడలేదన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేసిన దౌర్భాగ్యుడు జగన్ అని, ఆయనకు వంతగాడిగా సజ్జల రామకృష్ణారెడ్డి తయారయ్యారన్నారు. ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిన జగన్‌కు జనాలు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు పాలనలో యువకులకు ఐటీలో ఉద్యోగాలు కల్పిస్తే, జగన్ పాలనలో చేపల దుకాణాలు, మద్యం షాపుల్లో ఉద్యోగాలు ఇస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో విశాఖను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. తాత తండ్రులు సంపాదించి ఇచ్చిన భూములకు సంబంధించి పత్రాలపై దిష్టిబొమ్మలా జగన్ ఫొటోలు ముద్రిస్తున్నారని, ఇది అవసరమా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ తొలగిస్తామన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన జగన్‌ను గద్దె దించి, రాజకీయ సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. పోలీసులు కూడా మారాలని, వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమన్నారు. దోచుకునే దొంగ జగన్‌కు సహకారం అందించవద్దని విజ్ఞప్తి చేశారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ ఎస్టీల హత్యలు ఎక్కువైపోయాయని అయ్యన్నపాత్రుడు ఆరోపించారు.

అనకాపల్లి ఎంపీ సీటు నా కుమారుడికి లభిస్తే ఆదరించండి

అనకాపల్లి ఎంపీ సీటు కావాలని పార్టీని కోరామని, మాడుగుల మోదకొండమ్మ తల్లి దయతో ఒకవేళ తన కుమారుడికి అవకాశం వచ్చినట్టయితే, తనను ఆశీర్వదించినట్టే తన కుమారుడిని కూడా ఆశీర్వదించి గెలిపించాలని అయ్యన్నపాత్రుడు కోరారు.

విశాఖను వైసీపీ నేతలు దోచుకున్నారు

... 3వ పేజీ తరువాయి

మరింత ఉత్సాహపరిచారు. కాగా 'రా.కదలిరా' సభకు టీడీపీ నాయకులు ఊహించని దానికన్నా ఎక్కువ మంది హాజరయ్యారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం నిండిపోగా, ఇంకా చాలామంది రోడ్లపైనే వుండాల్సి వచ్చింది. దీంతో వెంకన్నపాలెం-కె.కోటపాటు రోడ్డులో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సభాస్థలి నుంచి చౌడువాడ వరకు వాహనాలు బారులు తీరాయి.

22 నుంచి విశాఖలో ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈనెల 22 నుంచి 25 వరకూ విశాఖలో నిర్వహించనున్నట్టు అఖిలభారత కోశాధికారి ఎస్.పుణ్యవతి తెలిపారు. సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సమస్యలపై నిరంతర పోరాటాలు జరిగే విశాఖలో ఈ సమావేశాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. 1981లో అఖిల భారత సంఘంలో భాగంగా ఏర్పాటైన ఐద్వా ప్రస్తుతం కోటి మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద సంఘంగా తయారైందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీల హక్కులను కాలరాయడం, స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేస్తోందన్నారు. కులం, మతం, కట్టుబాట్ల పేరుతో మహిళలను అణిచివేస్తోందని ఆరోపించారు. అసమానతలు అధిగమిస్తేనే మహిళా అభ్యున్నతి సాధ్యమవుతునందన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, స్వేచ్ఛ కోసం చేయాల్సిన పోరాటం, కర్తవ్యాలపై జాతీయ సమావేశాల్లో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశాలకు అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, మహిళా అభ్యుదయవాదులు హాజరై విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశాలు ప్రారంభం రోజైన 22న భారీ ప్రదర్శన, బహిరంగసభ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి పాల్గొన్నారు.

వేతనం పెంపు హామీ ఐదేళ్లయినా అమలు చేయలేదు

- భోజన పథకం కార్మికులకు రాష్ట్ర సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి ధ్వజం
- డిమాండ్ల సాధనకు కార్మికులు ధర్నా



నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి రాక ముందు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా భోజన పథకం కార్మికులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఐదేళ్లయినా అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. ప్రతి నెల ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, మెనూ చార్జీలను రూ.20కి పెంచాలని, ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఏటా రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఎం.శ్రీదేవి, ఎస్.గౌరి, ఎస్.అమ్మాజీ, ఎస్కే బాబీ తదితరులు పాల్గొన్నారు.

తరలిన టీడీపీ శ్రేణులు



అనకాపల్లి జిల్లా ఆఫీస్ నుంచి రా.. కదలిరా.. సభకు బయలుదేరుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీష్, నేతలు



అనకాపల్లిలో వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ యువ నేత దాడి రత్నాకర్



సబ్బవరం దుర్గమాంబ ఆలయం నుంచి బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులతో మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి



నక్కపల్లిలో చంద్రబాబు సభకు వెళ్లే వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిత, నాయకులు



రాంబిల్లి మండలం వెంకటాపురంలో వాహనాలను ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

పౌర సేవలకు అందుబాటులో ఉంటా

» బాధ్యతలు చేపట్టిన జడ్సీ అయ్యప్పనాయుడు



అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పౌర సేవలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు చెప్పారు. కోనసీమ అంబేడ్కర్ జిల్లా అమలాపురం మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చిన ఆయన సోమవారం జడ్సీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జోన్ పరిధిలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తామన్నారు. అలాగే రెవెన్యూ పెంపునకు చర్యలు తీసుకుంటామన్నారు. అనకాపల్లిలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు ప్రధాన కమిషనర్ సహకారంతో కృషి చేస్తానన్నారు. స్థానిక పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకుంటామన్నారు. జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అయ్యప్పనాయుడుకు కార్యాలయ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ జడ్సీగా పనిచేసిన ఎస్. వెంకటరమణ రాజమహేంద్రవరం డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

డిబేట్ పోటీల్లో విజేతలకు బహుమతులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 : భారత్ వికాస్ పరిషత్ సప్తాహ్‌లో భాగంగా సోమవారం జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికలు, ప్రజల హక్కుల బాధ్యతలు అనే అంశంపై డిబేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిషత్ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాసవి బాలవిహార్ స్కూల్‌కు చెందిన కె.అక్షయ ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ బహుమతిని విద్యాధరి స్కూల్‌కు చెందిన కె. అమూల్య, తృతీయ బహుమతిని అదే స్కూల్‌కు చెందిన పి.యాస్మిని గెలుచుకోగా, బి.చైతన్యకుమార్, కె.లక్ష్మి ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా కేఎల్ఎన్ మూర్తి, కె.రమాదేవి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వై. కేశవరావు, బీవీ రాజు, వి.ఈశ్వరరావు, చదరం కోటేశ్వరరావు, వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయనిర్ణేత కె.రమాదేవిని పరిషత్ ప్రతినిధులు సత్కరించారు.

టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేష్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 : న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్రఉపాధ్యక్షుడిగా స్థానిక గవరపాలెంకు చెందిన ఎ.మహేష్ నియమితులయ్యారు. ఆదివారం 30వ వార్డులో రాష్ట్ర అధ్యక్షుడు వి. వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహేష్‌కు రాష్ట్ర అధ్యక్షుడు నియామకపు పత్రాన్ని అందజేశారు.

'నులిపురుగుల మాత్రలు వేసుకోవడం తప్పనిసరి'

పరవాడ, ఫిబ్రవరి 5: విద్యార్థులు తప్పనిసరిగా నులిపురుగుల మాత్రలు వేసుకోవాలని పరవాడ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం సూచించారు. భరిణికం పంచాయతీ పరిధిలోని బాపడుపాలెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలు తప్పనిసరిగా నులిపురుగుల మాత్రలు వేసుకోవాలన్నారు. ఈనెల తొమ్మిదిన అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో ఉచితంగా మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.రాజేశ్వరి, ఉపాధ్యాయుడు కె. గంగాధర్, ఆరోగ్య శాఖ సిబ్బంది ఎంఎస్ సతీష్, లోవకుమారి, వై. వరలక్ష్మి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఎన్టీపీసీ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన ఎన్టీపీసీ విద్యార్థులు

పరవాడ, ఫిబ్రవరి 5 : ఈనెల మూడు, నాలుగు తేదీల్లో విశాఖపట్నం రాజీవ్‌గాంధీ ఇండోర్ పోర్టు స్టేడియంలో నిర్వహించిన ఏడో అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో పలు పతకాలు సాధించినట్టు కోచ్ గొర్లి పుష్పారావు తెలిపారు. సమీక్షా సాహూ బంగారు, వెండి పతకాలు, టి. భవ్యశ్రీ వెండి, రాగి పతకాలు, టి.సుమశ్రీ, అశ్విన్ అనీష్ చెరో రెండు రాగి పతకాలు, ఎస్.సాయి నారాయణ ఒక రాగి పతకం సాధించారు. సోమవారం విద్యార్థులను ఎన్టీపీసీ అధికారులు అభినందించారు.

ఏపీపీ సత్యనారాయణకు సత్కారం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5: గణతంత్ర వేడుకల్లో అవార్డు అందుకున్న జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీ బీవీ సత్యనారాయణను సోమవారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు సత్కరించారు. జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్‌వీ లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానాధికారిణి సుభాషిణికి సత్కారం



జిల్లా ఖజానాధికారిణిని సత్కరించిన పెన్షనర్లు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 : గణతంత్ర వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న జిల్లా ఖజానాధికారి వీఎల్ సుభాషిణిని జిల్లా ప్రభుత్వ పింఛన్‌దారులు సోమవారం సత్కరించారు. అలాగే కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సలీమ్ సయ్యద్, జూనియర్ అకౌంటెంట్ టి. సాయి అఖిలేష్‌లను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి తాలుకా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డాది జగన్నాథరావు, బీఎల్ఎన్ వర్మ, ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై సత్వరమే స్పందించండి : కలెక్టర్



అర్జీదారుని నుంచి వివరాలు నోట్ చేసుకుంటున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



స్పందనలో అర్జీదారుని నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 5: స్పందనకు వచ్చే అర్జీలపై అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సోమవారం 380 అర్జీలు వచ్చాయి. సమస్యల పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చే అర్జీల్లో ప్రధానంగా భూసమస్యలు, రేషన్‌కార్డులపై అధికంగా వస్తున్నాయని, సంబంధిత అధికారులు వాటి పరిష్కారంలో దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి : ఎస్పీ

దూర ప్రాంతాల నుంచి బాధితులు తరలివచ్చి తమ సమస్యలను చెప్పుకుంటారని, అధికారులు సకాలంలో అర్జీలపై స్పందించి న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ అర్జీలపై తీసుకున్న చర్యలు గురించి నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. స్పందన ముగిసే సరికి 34 అర్జీలు అందగా, అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

18 ఏళ్ల తర్వాతే ఆడపిల్లలకు పెళ్లి చేయాలి

» జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



బాల్య వివాహాల నిషేధంపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : బాలికలను బాలురలతో సమానం చదివించి, వారికి 18 సంవత్సరాలు పూర్తయ్యాక పెళ్లి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన 'బాల్య వివాహాల నిషేధం'పై బేటి పడావో బేటి బచావో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టయితే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ విషయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. బాల్య వివాహాలు నిర్వహించినా.. వారిని ప్రోత్సహించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం. జాహ్నవి, డీఆర్వో బి. దయానిధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగంగా పూర్తిచేయాలి : ఆర్డీవో



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్‌డీవో జయరాం

కోటవురట్ల, ఫిబ్రవరి 5: రెవిన్యూ డివిజన్‌లో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం రెవెన్యూ సిబ్బంది ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్‌లోని 10 మండలాల్లో 18,800 రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 18,600 ఇళ్లకు మ్యాపింగ్ చేశారన్నారు. 14 వేల ఇళ్లు రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఇళ్ల రిజిస్ట్రేషన్లలో నర్సీపట్నం డివిజన్ మొదటి స్థానంలో ఉందన్నారు. డివిజన్‌లో నక్కపల్లి మండలం ప్రథమ స్థానం, ఎస్.రాయవరం మండలం ద్వితీయ స్థానం, మాకవరపాలెం మండలం మూడో స్థానంలో ఉన్నాయన్నారు. కోటవురట్ల మండలంలో 540 ఇళ్ల రిజిస్ట్రేషన్లకుగాను ఇప్పటివరకు 300 వరకు పూర్తి చేశారన్నారు. డివిజన్‌లో భూముల రీసర్వే పనులు 60గ్రామాల్లో పూర్తయ్యాయన్నారు. మరో ఆరు గ్రామాలు తహసీల్దార్ లాంగిన్‌లో ఉన్నాయన్నారు. ఈ గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటరమణ, డీటీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి

» రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు



పొలాలను పరిశీలిస్తున్న ఎం. అప్పలరాజు తదితరులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 5: రైతులు సాగు చేసే పంట భూములకు నష్టం కలిగించే చేపల చెరువుల యాజమాన్యాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం చేపలు, రొయ్యల చెరువుల వలన కర్రివానిపాలెం, వెంకటాపురం, పిట్లపాలెం గ్రామాల్లో నష్టపోతున్న పంట పొలాలను అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ఎం. రాజేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ చేపలు, రొయ్యల చెరువుల కారణంగా తమ పొలాల్లోకి ఉప్పు నీరు ఊరడంతో చౌడుబారిపోయాయని రైతులు వారికి వివరించారు. ఈ విషయాన్ని రైతులు పలుమార్లు చేపల చెరువుల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రైతులు వివరించారు. దీనిపై స్పందించిన రైతు సంఘం నేతలు మాట్లాడుతూ.. రైతులకు నష్టం కలిగిస్తున్న చెరువుల యాజమాన్యంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా చెరువులపై సమగ్ర సర్వే చేసి, అందులోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పి. సూర్యనాగేశ్వరరావు, జి.సూరిబాబు, పి.అప్పారావు, ఎ. బాబూజీ, పి.గోవింద్, పి. దివాణం, వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

» బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామాంజనేయ చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామాంజనేయ చౌదరి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి శ్రీనివాస చౌదరి అన్నారు. సోమవారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండడంతో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. బీజేపీ శేణులు ప్రతి ఇంటికి వెళ్లి కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. యువకులను చేర్చుకొని పార్టీ పటిష్ఠతకు దోహదపడాలన్నారు. ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గొంతిన భక్త సాయిరాం, కర్రి చిట్టిబాబు, డి.పరమేశ్వరరావు, వర్మరాజు, మేరుగు కాసుబాబు పాల్గొన్నారు.

బదిలీపై వచ్చిన అధికారులకు ఘన సన్మానం

పాయకరావుపేట, ఫిబ్రవరి 5 : పాయకరావుపేటకు ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దారు జీఏ.సూర్యనారాయణ, ఎంపీడీఓ కె.స్వప్నలను జిల్లా వ్యవసాయ సలహా అభివృద్ధి మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యుడులంక సూరిబాబు ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లిన పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు వారిని సన్మానించారు. కార్యక్రమాల్లో వైసీపీ పట్టణ అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా, నాయకులు ఇసరపు తాతారావు, జగతా శ్రీను, దేవవరపు వెంకటేశ్వరరావు, చోడిపల్లి శ్రీనివాస్, వంగలపూడి రామరావు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

» జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 5: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులంతా విద్యార్థులను తీర్చిదిద్దాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు సూచించారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం జరిగిన హైస్కూళ్ల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఏఎస్ఎస్ఎస్‌పి మూర్తి పాల్గొన్నారు.

ఇద్దరు పేదలకు ఆర్థిక సాయం

రాంబిల్లి, ఫిబ్రవరి 5 : మండలంలోని లాలంకోడూరులో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పేదలకు జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు కశిరెడ్డి సర్వేశ్వరరావు సోమవారం ఆర్థిక సాయాన్ని చేశారు. ఎరకన్నపాలెంకు చెందిన లాలం సత్తిబాబుకు రూ.ఐదు వేలు, లాలంకోడూరుకి చెందిన లాలం రాజుకు రూ. ఐదు వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సైనికులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి : జూపూడి

సబ్బవరం, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో క్రైస్తవుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు ప్రభుత్వ సామాజిక సలహాదారు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. వెదుళ్లనరవలో సోమవారం బిషప్ తండు ఆనందకుమార్ ఆధ్వర్యంలో జరిగిన పాస్టర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అనంతరం జూపూడి ప్రభాకర్‌ను లైఫ్ చర్చి వ్యవస్థాపకులు రోజ్ విల్లీ, బిషప్ ఆనంద్‌కుమార్ సత్కరించారు. ఎల్.శామ్యూల్, విజయ్‌దాస్, పాల్‌రాజ్, విక్టర్ రాజ్, సురేష్ పాల్గొన్నారు.

మెరక గ్రామాల రైతు సమస్యలపై వినతి

నక్కపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని 10 మెరక గ్రామాల రైతుల సమస్యలపై సోమవారం వైస్ ఎంపీపీ వీసం నానాజీ స్పందనలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా డొంకాడ గ్రామంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువకు ఆనుకుని 1,100 ఎకరాల్లో అరటి, వంగ, కొబ్బరి, టమాటా పంటలను వేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. పలువురు రైతుల పొలాలకు విద్యుత్ సదుపాయం లేనందున ఇబ్బంది పడుతున్నారని, రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థి మృతికి వార్డెన్ నిర్లక్ష్యమే కారణం?

... 3వ పేజీ తరువాయి

సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఆర్డీవోకు నివేదిక అందిస్తున్నట్టు చెప్పారు.

ప్రాథమిక పాఠశాలలోకి హాస్టల్ తరలింపు

సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ ఎం.శ్యామల, ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ సోమవారం వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, వసతిగృహం భవనం మరమ్మతులకు గురవడంతోపాటు కరెంట్ ఎర్త్ అవుతుండడంతో హాస్టల్‌నే ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రవి, కె.పరదేశి

చీడికాడ, ఫిబ్రవరి 5 : స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షునిగా ఆసంట రవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.పరదేశి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన కాపల్లిలో ఆదివారం జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా కార్యదర్శులుగా త్రినా థ్, ఉమామహేశ్, రఘుబాబు, సుభానీ, మహిళా కార్యదర్శిగా సునీతను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా త్రినాథబాబు వ్యవహరించారు.

తెరువుపల్లిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 5: మునిసిపాలిటీ తెరువుపల్లిలో సోమవారం ఎన్టీరామారావు కాంస్య విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పప్పల చలపతిరావు మాట్లాడుతూ ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని తీసుకువచ్చి, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ కారణజన్ముడు అని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ మాట్లాడుతూ రాజకీయ పార్టీని నెలకొల్పిన ఆచిరకాలంలోనే పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. విగ్రహదాతలైన పిల్లా గంగాధర్‌రావు, పిల్లా సత్యనారాయణ, దాడిశెట్టి పైడియ్య, తుమ్మపాల గంగాధర్‌రావు, గేదెల అప్పలనాయుడు, తుమ్మపాల కోటిపల్లినాయుడు, పిల్లా జయరాం, కలం చిన్నారావులను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పిల్లా హైమావతి,దూలి రంగనాయకులు, గొర్లె నానాజీ పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5: అనకాపల్లి తహసీల్దార్‌గా కోరాడ శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం నుంచి అనకాపల్లికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన గంగాధరరావును అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారిగా బదిలీ అయ్యారు.

సబ్బవరం తహసీల్దార్‌గా చలమయ్య



సబ్బవరం, ఫిబ్రవరి 5: మండల తహసీల్దార్‌గా జె.చలమయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి నుంచి ఇక్కడకు ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బి.సత్యనారాయణ అనకాపల్లి కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు.

సచివాలయాల్లో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు



ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు

నక్కపల్లి, ఫిబ్రవరి 5: జగనన్న కాలనీల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ మండలంలోని పలు సచివాలయాల్లో సోమవారం ప్రారంభించారు.ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ పర్యవేక్షణలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. స్థానిక సచివాలయం పరిధిలో సర్వర్ సమస్య రావడంతో ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్ఏలు,సెక్రటరీలు రిజిస్ట్రేషన్ చేశారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

అచ్యుతాపురం, ఫిబ్రవరి 5: స్థానిక విద్యా సంస్థల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై యువజన సర్వీసులు, సెట్విస్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకొని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. సరైన కమ్యూనికేషన్ స్కిల్స్‌లేక చాలా మంది యువత ఉపాధి అవకాశాలు పొందలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ బి.సంధ్యప్రకాశరావు, సూపరింటెండెంట్ ఎంఎస్‌వీ సన్యాసిరావు, రిసోర్స్‌పర్సన్ సీఏ.బాబు, అచ్యుతా విద్యాసంస్థల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, క్రైట్ కాలేజీ కరస్పాండెంట్ చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్షలు



రిలే దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ హక్కుల యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కోర్టు వద్ద న్యాయవాదులు చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 44వ రోజుకు చేరుకున్నాయి. న్యాయవాదుల దీక్షలకు మద్దతుగా గుమస్తాలు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో మళ్ల నూకరాజు, విజయ ఆనంద్, ఆర్. రమణ, ఆర్. శేఖర్, బి. లోవరాజు, బీహెచ్. ప్రసాద్, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రామచంద్రపురంలో తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

కోటవురట్ల, ఫిబ్రవరి 5: మండలంలోని రామచంద్రపురంలో తుని నాసా స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన తాగునీటి బోరును సోమవారం సంస్థ ప్రతినిధులు మైసూర్, రాజా, జడ్‌పీటీసీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా వంతర వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు బోరును వినియోగించుకోవాలని కోరారు.

ఏపీ ఫైబర్ ద్వారా విస్తృత ఇంటర్‌నెట్ సేవలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 5: స్థానిక సిటీ కేబుల్ కార్యాలయంలో సోమవారం ఏపీ ఫైబర్ నెట్ అధికారులు, ఆపరేటర్ల సమావేశం జరిగింది. జిల్లా ఎంఎస్‌ఓ జానకిరామ్, శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సీనియర్ మార్కెటింగ్ మేనేజరు ఆర్‌వీ సతీష్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అతి తక్కువ ధరలకు ఇంటర్నెట్, టీవీ చానల్స్, ల్యాండ్ ఫోన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.


మాడుగుల మండలం జమ్మాదేవిపేట నుంచి చంద్రబాబు సభకు బయల్దేరుతున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు


చోడవరం నుంచి గొండుపాలేనికి తరలివెళుతున్న తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు తదితరులు


చోడవరం- గొండుపాలెం మధ్యలోని చౌడువాడ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

తెలుగు తమ్ముళ్ల కేరింత

▸▸ చంద్రబాబు సభకు భారీగా తరలి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

▸▸ జనసేన పార్టీ నుంచి కూడా జెండాలు చేతబట్టి హాజరు


దేవరాపల్లి మండలం చినసందిపల్లి నుంచి..


చంద్రబాబుకు జ్ఞాపిక అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

మాడుగుల/ మాడుగుల రూరల్, ఫిబ్రవరి 5 : నియోజకవర్గంలోని కె.కోటపాడు మండలం గొండుపాలెంలో సోమవారం రా.. కదలి రా.. పేరిట టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన బహిరంగ సభకు మాడుగుల మండలం నుంచి జనం భారీగా తరలి వెళ్లారు. తెలుగుతమ్ముళ్లు పసుపు చొక్కాలు ధరించి, పార్టీ జెండాలు చేతబడి జై చంద్రబాబు.. జైజై చంద్రబాబు అని నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. మహిళలు సైతం పెద్ద సంఖ్యలో తరలి వెళ్లడం విశేషం. అలాగే, జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా ఆ పార్టీ జెండాలను పట్టుకుని సభకు వెళ్లారు. చంద్రబాబునాయుడు ప్రసంగం విన్న పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న ఎన్నికల్లో పనిచేసి నియోజకవర్గంలో విజయభేరి మోగిస్తామని చెపుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల రమేశ్, వడ్డి రాజ్‌కుమార్, రంజిత్, కాశిబాబు, సూరిబాబు వర్మ, సన్యాసిరావు, శివాజీ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు సభకు ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో వారంతా ముందుకు సాగారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండను సైతం లెక్కచేయక సభా స్థలి వద్ద ఉత్సాహంగా ఉన్నారు. ఆద్యంతం చంద్రబాబు ప్రసంగాన్ని విని నూతనోత్తేజం పొందారు. పెద్ద సంఖ్యలో మహిళలు సైతం తరలి వెళ్లడం విశేషం.

రోలుగుంట : చంద్రబాబునాయుడు సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు గుమూలూరు చంద్రమౌళి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. రోలుగుంట, కొమరవోలు, కుసర్లపూడి, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, శరభవరం, వడ్డిప, రత్నంపేట, అడ్డసరం తదితర గ్రామాల నుంచి పయనమయ్యారు.

వైసీపీ నుంచి టీడీపీలో పలువురు చేరిక


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వేచలం ఎంపీటీసీ సభ్యులు రెడ్డి శ్రీలక్ష్మి దంపతులు, తదితరులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 5 : మండలంలోని వైసీపీకి చెందిన వేచలం ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి, ఆమె భర్త మాజీ ఎంపీటీసీ బలరామమూర్తిలు చంద్రబాబునాయుడు సమక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కె.కోటపాడు మండలం గొండుపాలెంలో రా.. కదలి రా.. పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ఈ మేరకు చంద్రబాబు వీరితో పాటు వైసీపీ నాయకులు కలిగొట్లకు చెందిన సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ బొడ్డు జగదీశ్వరరావు, వాకపల్లికి చెందిన పెనగంటి సింహాచలంనాయుడు, కొత్తపెంటకు చెందిన చిరికి గోవిందరావు, గొర్రుపోటు సన్యాసినాయుడు, గొర్లె గోవింద తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గొండుపాలెం- చోడవరం రోడ్డులో భారీగా ట్రాఫిక్ జాం

చోడవరం : గొండుపాలెంలో చంద్రబాబు సభకు ఇటు చోడవరం నియోజకవర్గంతో పాటు, అటు మాడుగుల నియోజకవర్గం నుంచి, అలాగే జిల్లాలోని వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావడంతో ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో వాహనాల్లో రావడంతో చోడవరం- గొండుపాలెం, చౌడువాడ మధ్యలో భారీగా నిలిచిపోయి. ఇదిలావుంటే, చోడవరం నియోజకవర్గం నుంచి భారీగా తరలి వెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడుల సారథ్యంలో పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి అంతా ఊరేగింపుగా తరలివెళ్లారు.

'జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి'

మాడుగుల/కోటపాడు : మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అథోగతిపాలు చేశారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ఆరోపించారు. కె.కోటపాడు మండలం గొండుపాలెంలో జరిగిన రా.. కదలి రా... సభలో మాట్లాడారు. వైసీపీ అరాచక, అవినీతి పాలనను అంతమొందించేందుకే టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకుందన్నారు.

గౌరీపరమేశ్వరుల తీర్థం ప్రారంభం


గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు

మాకవరపాలెం, ఫిబ్రవరి 5 : కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల తీర్థం సోమవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ వేడుక జరగనుంది. తొలిరోజు ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధిల్లో ఊరేగించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ పెద్దలు పోలిరెడ్డి రమణ, చిటికల రమణ, ఈశ్వరరావు, చిన్నా తదితరులతో పాటు నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఏకగ్రీవం


అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రవి, కె.పరదేశి

చీడికాడ, ఫిబ్రవరి 5 : స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షునిగా ఆనంట రవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.పరదేశి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనకాపల్లిలో ఆదివారం జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా కార్యదర్శులుగా త్రినాథ్, ఉమామహేశ్, రఘుబాబు, సుభానీ, మహిళా కార్యదర్శిగా సునీతను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా త్రినాథబాబు వ్యవహరించారు.

కోళ్ల ఫారం లబ్ధిదారులకు న్యాయం చేయాలి


కోళ్ల ఫారం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులు

రావికమతం,ఫిబ్రవరి 5 : కొత్తకోటలోని కోళ్ల ఫారం లబ్ధిదారులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయకుంటే ఈ నెల 15 నుంచి దళిత బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమరణ నిరహార దీక్షలు చేపడతామని ఆ సంఘ జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు స్పష్టం చేశారు. కోళ్ల ఫారం లబ్ధిదారులతో కలిసి సోమవారం ఆయన మూతపడిన ఫారాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నలభై సంవత్సరాల క్రితం కొత్తకోటలోని ఎస్సీలకు అప్పటి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జీవనోపాధి కోసం కోళ్ల పెంపకం పథకం ప్రారంభిందన్నారు. కొంత కాలం పాటు బాగానే సాగినప్పటికీ నష్టాలు రావడంతో కోళ్లఫారాలు మూతపడ్డాయన్నారు. సమస్య విప్ ధర్మశ్రీ వద్దకు తీసుకు వెళ్లడంతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మడమ తిప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిసనగానే దీక్ష చేపట్టాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి ప్రాంతాల్లో చేతిబోర్లు ఏర్పాటు'

నాతవరం, ఫిబ్రవరి 5 : మండల కేంద్రం నాతవరంలోని ఆస్పత్రి సమీప కాలనీలో నాసా సంస్థ డైరెక్టర్ ప్రేమదాసు సహకారంతో ఏర్పాటు చేసిన చేతిబోరును ఆ సంస్థ ప్రతినిధులు రాజాకులపతి సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి తమ సంస్థ చేతిబోర్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యపగతి సంఘం నాయకులు సమర్ల రామారావు, ఎస్.విజయ్‌కుమార్, చక్కా జోగిరాజు, కొండ్రు మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి మృతికి వార్డెన్ నిర్లక్ష్యమే కారణం?

... 3వ పేజీ తరువాయి

సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఆర్డీవోకు నివేదిక అందిస్తున్నట్టు చెప్పారు.

ప్రాథమిక పాఠశాలలోకి హాస్టల్ తరలింపు

సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ ఎం.శ్యామల, ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ సోమవారం వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, వసతిగృహం భవనం మరమ్మతులకు గురవడంతోపాటు కరెంట్ ఎర్త్ అవుతుండడంతో హాస్టల్‌నే ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

విరాళాలతో బోరు తవ్విస్తే.. ఇప్పుడు తవ్వించినట్టు అజెండాలోనా...?

▸▸ టీడీపీ, జనసేన కౌన్సిలర్లు ప్రశ్న ▸▸ స్పందనలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు ఫిర్యాదు


ఏవోతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు పెదిరెడ్ల చింతు, పైల గోవింద్

నర్సీపట్నం, ఫిబ్రవరి 5 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పదిమంది విచ్చేసి సమస్యలపై అర్జీలు సమర్పించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి వి.ప్రకాశరావు అందరితో మాట్లాడారు. మునిసిపాలిటీలోని 28వ వార్డు అయ్యన్న కాలనీలో కల్యాణ మండపం వద్ద స్థానికుల విరాళాలతో 2022లో బోరు తవ్వించారని, అదే బోరు ఇప్పుడు తవ్వించినట్టు కౌన్సిల్ అజెండాలో పెట్టారని ఆరోపిస్తూ టీడీపీకి చెందిన కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, ధనిమిరెడ్డి మధు, నాయకులు పెదిరెడ్ల చింతు, పైల గోవింద్, జనసేన నాయకుడు అద్దేపల్లి గణేశ్ ఫిర్యాదు చేశారు. అలాగే, చెట్టుపల్లిలోని తనకు గల భూమి సర్వే నెంబరు 425/3లో 24సెంట్లు, 427/3లో 42 సెంట్లు, 430/3లో ఎనిమిది సెంట్లను ఆన్‌లైన్ చేయాలని అప్పికొండ నూకరత్నం విన్నవించారు.

శారదానగర్‌లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు వినతి


ఆర్డీవోకు వినతిని అందిస్తున్న కాలనీవాసులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 5 : ఇక్కడి శారదా స్కూల్‌లో రద్దు చేసిన పోలింగ్ కేంద్రాలను శారదానగర్‌లోనే ఏర్పాటు చేయాలని పలువురు కాలనీవాసులు ఆర్డీవో హెచ్‌వీ జయరాంను కోరారు. ఈ మేరకు సోమవారం వినతి పత్రం అందజేశారు. మునిసిపాలిటీ పరిధిలోని శారదానగర్ శారదా స్కూల్‌లో 141, 142, 143, 144, 145 పోలింగ్ కేంద్రాలు ఉండేవన్నారు. స్కూల్ భవనం పడగొట్టడం వలన పోలింగ్ కేంద్రాలను శాంతినగర్‌లోని డాన్‌బాస్కో స్కూల్‌కు మార్చినట్టు చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉంటే పోలింగ్ శాతం తగ్గుతుందని వివరించారు. గత ఎన్నికల్లో శారదానగర్‌లో 50 శాతం కంటే తక్కువ పోలింగ్ జరిగిందని, ఇప్పుడు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉంటే పోలింగ్ శాతం మరింతగా తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. శారదానగర్‌లో ఉన్న ప్రైవేటు స్కూళ్లు, కళాశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్సా శ్రీనివాసరావు, పూడి చంద్రశేఖర్, గుంటపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం


ధ్యానంపై వివరిస్తున్న డాక్టర్ జ్యోతిర్మయి

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 5 : ధ్యానంతో శారీరక, మానసిక రుగ్మతలు తొలగి ఆరోగ్యవంతంగా జీవించవచ్చని చోడవరానికి చెందిన డాక్టర్ జ్యోతిర్మయి అన్నారు. వడ్డాది మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ధాన్యంపై సోమవారం అవగాహన కల్పించారు. ధ్యాన సాధన చేస్తూ బీపీ, షుగర్, చర్మ వ్యాధులు, వెన్నునొప్పి తదితరాలను నయం చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైదానంలో దట్టంగా పొగ మంచు

▸▸ మన్యాన్ని తలపించేలా మాడుగుల పరిసర ప్రాంతల్లో వాతావరణం




కేజేపురం సమీపంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 5 : మన్యానికి ముఖద్వారంగా ఉన్న మాడుగుల మండలంలో మంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం వేకువజాము నుంచి కేజేపురం, ఎం.కోటపాడు, వల్లాపురం తదితర గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల వరకు మంచుతెరలు వీడ లేదు. దీంతో పొలం పనులకు వెళ్లే రైతులు, విద్యార్థులు, వివిధ పనులపై వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు రహదారి కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ఇదిలావుంటే, ఈ ప్రకృతి అందాలను యువత ఆస్వాదించారు. కొందరు సెల్‌ఫోన్ కెమెరాల్లో ఈ రమణీయ దృశ్యాలను బంధించారు.

అల్లూరి పార్కును సందర్శించిన విద్యార్థులు


అల్లూరి పార్కులో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 5 : ఇక్కడి అల్లూరి పార్కును తుని మండలం డి.పోలవరం ఎంపీపీ పాఠశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయిని, అల్లూరి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ తన సొంత నిధులతో విద్యార్థులను, తోటి ఉపాధ్యాయులను ఇక్కడికి తీసుకు వచ్చారు. పార్కులోని అల్లూరి సీతారామరాజు, గంటందొరల సమాధుల వద్ద వారంతా నివాళులర్పించారు. తొలుత అల్లూరి పోరాట పటిమను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం నర్సీపట్నంలో గల బ్రిటీష్ సేనానుల సమాధులను సందర్శించారు.

పాడి పశువులకు బీమా ప్రారంభం

రోలుగుంట, ఫిబ్రవరి 5 : పాడి రైతులు తమ పశువులకు బీమా చేయించుకోవాలని రోలుగుంట పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు సూచించారు. సోమవారం ఇక్కడ పాడి పశువులకు బీమాను ప్రారంభించారు. ప్రీమియంలో ఎనభై శాతం రాయితీతో పాడి పశువులు, దుక్కిటెద్దు, గొర్రెలు, మేకలకు మూడేళ్లపాటు బీమా కల్పిస్తున్నట్టు చెప్పారు.

ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు బాధ్యతలు



రోలుగుంట, ఫిబ్రవరి 5 : కొత్త ఎంపీడీవోగా కె.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లా మామిడి కొత్తూరు మండలం నుంచి ఇక్కడి బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న విజయ్‌కుమార్ తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు.

కృష్ణాదేవిపేట బస్ స్టేషన్‌లో ఎక్కడి చెత్త అక్కడే!

▸▸ నాలుగు నెలలుగా పారిశుధ్య కార్మికునికి వేతనాలు చెల్లించకపోవడంతో విధులు బహిష్కరణ




బస్‌స్టేషన్‌లో బెంచీల మధ్య చెత్తాచెదారం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 5 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల ఆర్టీసీ బస్ స్టేషన్‌లో పారిశుధ్యం క్షీణించింది. ఇక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికునికి గత నాలుగు నెలలుగా వేతనం చెల్లించకపోవడంతో నాలుగు రోజులుగా విధులను బహిష్కరించాడు. దీంతో బస్ స్టేషన్‌లో చెత్త ఎక్కడికక్కడ దర్శనమిస్తోంది. మరుగుదొడ్లు పరిశుభ్రతకు నోచుకోకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ బస్ స్టేషన్‌లో పారిశుధ్య పనులకు జల్లు అప్పారావు అనే పారిశుధ్య కార్మికుడ్ని అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఇతనికి భార్య చిట్టెమ్మ కూడా అప్పారావుకు సహాయంగా పారిశుధ్య పనులు చేపడుతోంది. నాలుగు నెలలుగా వేతనం లేకపోవడంతో తమ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయాడు. దీంతో బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు ఒకవైపు చెత్త, మరో వైపు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు వంద గ్రామాలకు ముఖద్వారంగా ఉన్న ఈ బస్ స్టేషన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు

రావికమతం, ఫిబ్రవరి 5 : మేజర్ పంచాయతీ కొత్తకోటలో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తీర్థం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలు, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

20 నుంచి ఉమామహేశ్వరీదేవి తీర్థం


సమావేశమైన ఉత్సవ కమిటీ సభ్యులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 5 : ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత ఉమామహేశ్వరీదేవి తీర్థం ఈనెల 20వ తేదీన ఇక్కడ ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు ఈ వేడుకను వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమావేశమయ్యారు. తీర్థంలో ఎటువంటి ఏర్పాట్లు చేపట్టాలి తదితరాలపై చర్చించారు. ప్రతినిధులు కిలపర్తి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త లలితా ప్రసాద్, వి.సింహాచలంనాయుడు, మహేశ్వరీనాయుడు, మొల్లి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



మాకవరపాలెం, ఫిబ్రవరి 5 : మండలంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మర్రి నాయుడు అధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం తహసీల్దార్ మురళీమోహన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామరం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన సతీశ్ అనే యువకునికి ఆ గ్రామంలోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేయాల్సిందిగా కోరారు. అలాగే చాలా గ్రామాల్లో గూడు లేని నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాంబాబు, అంజనేయమూర్తి, బత్తుల రమేష్, యర్రా కుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల్లో యువతకు శిక్షణ

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 5 : నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాకవరపాలెంలో గల స్కిల్ హబ్‌లో హౌస్ వైరింగ్, కుట్టుమిషన్ కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరగుతుందని వివరించారు. 15 నుంచి 45 ఏళ్ల గలవారు అర్హులుగా పేర్కొన్నారు. వివరాలకు 90147 65287 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

తురువోలులో అభివృద్ధి పనులు ప్రారంభం


రోడ్డు ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ, ఫిబ్రవరి 5 : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తురువోలులో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, సర్పంచ్‌లు మట్టా అప్పారావు, కోడూరు సత్యవతి, పి.టి.బాబు, మాజీ సర్పంచ్ లాలం ధనలక్ష్మి, వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజబాబు, లాలం జానకీరామ్, కొటకల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.